మా సీతకి సామాజిక స్పృహ చాలా యెక్కువ. మేమంతా దాన్ని ''సాసర్ (సా.స్పృ.కి వికృత రూపం) సీత'' అంటాం.

సీత అనే బూర్జువా పతి(వత పేరు పెట్టినందుకు వాళ్ళ అమ్మా నాన్నల్ని రోజుకోసారైనా తిడుతూ వుంటుంది. చదువుకొనే రోజుల్లో మేమంతా కాలేజ్ డిబేట్లలో ''కట్నాలివ్వం. ఇవ్వాల్సిన పరిస్థితులొస్తే పెళ్ళిళ్ళే మానేసి సంఘసేవ చేసి తరిస్తాం'' అని గొంతులు పోయేలా అరిచాం.




తర్వాత జీవితంలోనూ అదే లెవెల్‌లో యింకా అరిచే ఓపికా, తీరికా లేక, బుద్ధిగా ఎవరి కొనుగోలు శక్తిననుసరించి వాళ్ళు తలో మొగుడినీ కొనేసుకొని, జీవితాన్ని ఆనందంగా యిద్దరేసి పిల్లలూ, వందేసి అప్పులూగా (ఇద్దరేసి పిల్లలు జీవితం మొత్తానికీ, వందేసి అప్పు నెలకి చొప్పున) లాగించేస్తున్నాం. మా సీత మా(తం తన పల్లెటూరి బావని కట్నం యివ్వకుండా పెళ్ళి చేసుకొని ''ఆడుతు పాడుతు పనిచేస్తుంటే'' అని వాళ్ళాయనకి సాయంచేస్తూ వాళ్ళ పల్లెటూరిలోనే సెటిల్ అయిపోయింది. వాళ్ళ ఊరు యింకా సినిమా నాజూకుల, అ(ల్టా మోడర్న్ స్టయిల్స్ నేర్చుకోని పల్లెటూరి ముగ్ధలాగే, ఆకువాటు పిందెలాగే వుంటుంది. ఇక మా సీత యెప్పుడూ లంకంత కొంపా, పాడీ పంటా, ఊడ్పులూ, కుప్పనూర్పిళ్ళూ అంటూ పరమ బిజీగా ఆ చిన్న సా(మ్రాజ్యాన్ని యేలేస్తూ వుంటుంది. అలాంటి మా సీత ఉన్నట్లుండి మా విశాఖపట్నం వచ్చేసింది ఉరమని పిడుగులాగా.

''మీ యింట్లో ఓ వారం రోజులు మకాం. అలాగే గీతనీ, విద్యనీ, సుమతినీ కూడా పలకరించి ఓ నెల్లాళ్ళు మీ అందరితో గడపాలని నా ప్లాన్. ఆ పల్లెటూరినీ, పిల్ల రాక్షసుల్నీ వదిలేస్తున్నా ఓ నెలరోజులపాటు. మళ్ళా మనం చదువుకొన్న రోజుల్నీ, ఆ ఆనందాలనీ తల్చుకోకపోతే నేనసలు బియ్యే పాసయిన ఓ అత్యాధునికమైన అమ్మాయినని మర్చిపోయేలా వున్నాను.''

ఇంతకీ బియ్యే పాసయినవాళ్ళ బాబాయి కూతురు (బియ్యే చదివింది బాబాయ్ కాదు. అతని కూతురు) వీళ్ళ పల్లెటూరు వెళ్ళి అక్కడ చలాకీగా, కొత్త కొత్త ఫేషన్స్‌తో సీతా వాళ్ళాయన్ని ముగ్ధుడ్ని చేసేసరికి, మా సీతకి పుట్టెడు విచారం వేసిందట, ''ఒకప్పుడు నేనూ యిలాగే సీతాకోక చిలుకలా వుండేదాన్ని. ఇప్పుడిలా పల్లెటూరి బావ పాలబడి, పేడ పురుగులా మారిపోయేనే'' అని. (గొంగళి పురుగు నుంచి సీతాకోక చిలుక వస్తుందని చదూకున్నాంగానీ, సీతాకోక చిలుక నుంచీ పేడ పురుగు వస్తుందా రాదా థియరీ ఆఫ్ ఎవల్యూషన్ (ప్రకారం, అన్నది మా జులపాల జువాలజీ గార్ని అడగాలి) అందువలన కొన్నాళ్ళు సీతాకోక చిలకలా హాయిగా ఎగురుదామని మా యింటికి మొదట దయచేసింది.

నాలుగు రోజులు హుషారుగా పరుగెట్టేయి. బీచ్‌లన్నీ సర్వే చేశాం. చదువుకొనే రోజుల్లోని అల్లరి, చిలిపితనం అన్నీ మళ్ళీ వచ్చేశాయి. అయిదో రోజున సీత చెప్పింది. ''సినిమాకెళదాం. మంచిది ఏముందో

# నాటే కార్యక్రమం

రేః దేశంలో
ఏటేటా నాటిన మొక్కల సంఖ్య
వార్షిక నివేదికల్లో పోటువేస్కుంటుంది
మనమేకాదు నాటుతున్నది
చాలామంది చాలా నాటుతూవుంటారు
వాళ్ళ ఫ్యాక్టరీల మందుల అమ్మకాలకోసం
మన దేశంలో రోగాల్ని
వాళ్ళ ఆయుధాల చెల్లుబాటుకై
మనలో పరస్పర ద్వేషాల్ని

ఇది రేః గోళ వ్యాప్తమయిన నాటే కార్యక్రమం
మన వంతుగా మనం
మన పిల్లల్లో నాటుదాం
భయాన్ని కాదు   అరివీర భయంకర దేశప్రేమని
కదలని మొక్కల్నే కాదు
కదిలే మొక్కల్లో మొక్కవోని ధైర్యం కూడా
నాటే కార్యక్రమం చేపడదాం

— రామతీర్థ

చూడు. ఏ అయిదారేళ్ళో అయింది సినిమా చూసి" వాళ్ళ ఊళ్ళో టూరింగ్ సినిమా హాలైనా లేదు మరి.

ఒక్కసారి భయంతో వణికి పోయేను. అయిదారేళ్ళ నుంచీ తెలుగు సినిమా చూడలేదా? అయితేబాబోయ్. దీని సూపర్ సినిమాలూ, పాత భావుకత్వపు ప్రేమ సినిమాలే తప్ప, యిప్పటి సినిమాలు చూపిస్తే యింకే మైనా వుందా? తెలుగు సినిమాలు చాలా అభివృద్ధిని సాధించేయనీ, అవి చూసి ఆనందించాలంటే వాటిని క్రమంగా మత్తు మందు డోస్‌లా నెమ్మది నెమ్మదిగా అలవాటు చేసుకొంటే తప్ప లాభం లేదనీ యెలా చెప్పాలి? సర్లే, సరదాగా ఓ సినిమాకి తీసుకెళ్ళి...షాక్ ట్రీట్‌మెంట్ యిద్దాం. ఇప్పటి కాలం యెలా వుందో తెలుస్తుంది దీనికి. యెంత సేపూ పల్లెటూరూ, పేడా పిడకలేనా?

సాయంత్రం వంట త్వరగా పూర్తిచేసి పక్కయింటి వాళ్ళ పిల్లలు బీచ్‌కి వెళ్తుంటే మా పిల్లల్ని వాళ్ళతో పాటు పంపించేసి, నేనూ సీతా బయలుదేరేం సినిమాకి. సుధాకర్ నైట్ డ్యూటీ వుందని వెళ్ళి పోయాడు ఆఫీస్‌కి.

జగదాంబ జంక్షన్‌కి వచ్చేక ఏ సినిమాకి తీసుకెళ దామా అని ఆలోచించేను. మూడు సినిమా హాళ్ళలో ఓ ట్రయాంగిల్ ప్రేమ కథ, ఇంకో దానిలో ప్రేమ కథా సినిమా, ఇంకొకటి బ్రహ్మాండమైన కక్ష, కార్పణ్యాల సినిమా. ట్రయాంగిల్ సినిమాకి వెళదామా అంటే ఇద్దరు హీరోయిన్సూ నానా రకాల బాధలూ పడి, హీరోగారి నెత్తిమీద వెంట్రుకలు పోటీపడి పీకేసి, సెంటిమెంట్లు, త్యాగాలతో మనల్ని చంపేసి, తల కాయల్ని తినేస్తారు. ఫైటింగులూ, కక్షల సినిమా అసలు చూడలేం. ఇక లవ్ స్టోరీ. ప్రేమ కథల్ని యెలా తీసినా బాగుండవచ్చు. ఎందుకంటే "ప్రేమ" అనే అంశం ఎన్నిసార్లు తీసినా విసుగు పుట్టని విషయం కాబట్టి. అదీ కాక మా ఎదురింటి 15 యేళ్ళ రోజా చెప్పింది కూడా. "ఆంటీ, 'ప్రేమ సముద్రం' సినిమా మాత్రం మిస్ అవద్దు. బ్రహ్మాండంగా వుంది సుమా" అని, చక్రాల్లాంటి కళ్ళు తిప్పుతూ మరీని. ఆ అమ్మాయికి వారానికి నాలుగు సినిమాలైనా చూడకపోతే తిన్న తిండి కూడా అరగదుట.

సరే. 'ప్రేమ సముద్రం' ఆడుతున్న థియేటర్ లోకి ప్రవేశించాం. "మై గుడ్‌నెస్! ఏమిటిది–తిరు నాళ్ళా? సినిమానా?" సీత ఆశ్చర్యం. క్యూ పెరిగి పెరిగి రోడ్డు మీదకి వచ్చేసి, ట్రాఫిక్‌కి అంతరాయం ఏర్పడేలా వుంది. కొంతమంది వీరాభిమన్యులు చొక్కాలు విప్పేసి, జబర్దస్తీగా క్యూలో దూరిపోయి టిక్కెట్లు సంపాదించి, విజయ గర్వంతో అందిస్తు న్నారు టికెట్లు వాళ్ళ వాళ్ళ గర్ల్ ఫ్రెండ్స్‌కీ, పెళ్ళాలకీ. ఆడవాళ్ళ క్యూ ఇంకా యెక్కువగా వుంది. ఇక రేః


మీ టూత్‌బ్రష్ మీద తగినన్ని
కొసలు ఉన్నాయా?



సినిమాకి టికెట్స్ దొరికేలా లేవని నిరాశ పడిపోతూ వెనుతిరిగేసరికి సుధాకర్ స్నేహితుడు మూర్తి కన్పించేడు ఆపద్బాంధవుడిలా.

"అరె. ఏమిటింత ఆలస్యంగా వచ్చేరు? మీకు టిక్కెట్లు దొరకటం కష్టం. రెండు టికెట్లు వున్నాయి నా దగ్గర-కావాలా?" మూర్తి మాట పూర్తిచెయ్యనే లేదు అతని చేతిలోంచి టిక్కెట్లు లాగేసుకున్నాను.

"మరి...మీరు?" సీత అడిగింది.

"ఫ్రెండ్ వస్తానన్నాడు. వస్తే అయిదు గంటలకే వచ్చేస్తాడు. ఇంకా రాలేదంటే మరి రానట్లే. మీరు సినిమా చూడండి. నేను వాడింటికి పోతాను" వెళ్లిపోయేడు మూర్తి నా "మెనీ థాంక్స్" అందుకుని.

ఎ.సి. థియేటర్‌లో హాయిగా కూర్చున్నాం. సినిమా ప్రారంభమయింది. పద్దెనిమిదేళ్ళున్న పాలుగారే అబ్బాయి పెద్ద మోటారుసైకిలుమీద వచ్చి, వాళ్ళ మానాన వాళ్ళు పేకాడుకుంటున్న పదిమంది చిన్న సైజు గూండాల్ని మూతులు పగిలేలా, నెత్తుర్లు కారేలా తన్ని, క్రాఫ్, బట్టలూ (తనవి) సుతారంగా సర్దుకొని ప్రేక్షకులవైపో ఓరచూపు పారేసి, మళ్ళీ మోటార్ సైకిలెక్కి వెళ్ళిపోతుంటే, సినిమా టైటిల్స్ వేస్తున్నారు.

"ఎందుకు వాళ్ళని అనవసరంగా తన్నేడు?" సీత అనవసరపు ప్రశ్న.

## న్యాయమూ-అమీబా

న్యాయం
అమీబా లాంటిది
కాకపోతే
రెంటి మధ్యా
కొద్ది తేడా!
అమీబానేమో
తన రూపు తానే
మార్చుకుంటుంది!
అదే
న్యాయం విషయంలో
అలా కాదు!
అన్యాయమే దానిని
'అడ్డగోలు'గా
మారుస్తూ వుంటుంది!

—'రఘువర్మ'

"వాడికీ నీలాగే సామాజిక స్పృహ ఎక్కువ. వీళ్ల పేక ఆడటం సమాజానికి చెడు చేస్తుందిగా. అందుకు వాళ్ళని తన్నేడు"—నా వివరణ.

రెండో సీన్లో బొద్దుగా, ముద్దుగా వున్న పదిహేనేళ్ళ అమ్మాయి స్పీడ్‌గా కారు నడుపుకుంటూ వచ్చేసి, ఓ బక్క ముసలాడి సైకిల్ని (ముసలాడితో సహా) ఢామ్మ గుద్దేసింది. పాపం ముసలాడు పక్కనే రెడీగా వున్న బురద గుంటలో పడిపోయేడు రివాజుగా. మొదట వచ్చిన పద్దెనిమిదేళ్ళ హీరో అమాంతం ప్రత్యక్షం అయిపోయి, తన బట్టలకి బురద అంటకుండా జాగ్రత్తగా ముసలాయన్ని లేపి, కార్లోని పిల్లని చెయ్యి పట్టుకు లాగి దింపేసేడు కార్లోంచి. ఆ అమ్మాయికి డబ్బు గర్వం అనీ, పెట్టుబడి దారీ విధానాలు యిక చెల్లవనీ నాలుగు మూరల డైలాగ్ చెప్పి, ముసలాడికి క్షమాపణ చెప్పమన్నాడు అమ్మాయిని. ఈవిడా తీసిపోకుండా హీరోని తిట్టి, కారెక్కి నడుపుకుంటూ వెళ్ళిపోయింది క్షమాపణ చెప్పకుండానే.

"ఈ వేంప్ పిల్ల వల్ల కష్టాలొస్తాయి కాబోలు హీరోకి!" సీత ఊహ.

"ఏ కాలంలో వున్నావు? వేంప్ ఏమిటి నీ తలకాయ హీరోయిన్" సరిదిద్దేను.

"ఏమిటి? ఒళ్ళంతా కనిపించే ఆ బట్టలూ...హీరోయినా?"

"ఏం? వేంప్ మాత్రమే అలా వుండాలని రూలేమిటి? వెరైటీగా హీరోయిన్‌ని యిలా చూడు" దబాయించాను.

సీత ఆ హాశ్చర్యం నుంచి తేరుకోకముందే హీరో





సిబాకా ఏంగ్యులర్ డీలక్స్‌లో ఉన్నాయి
గుండ్రని చివరలు గల ఎక్కువ కొసలు.
ఇందువల్ల పళ్లు శుభ్రంగా మిలమిలలాడతాయి.
పైగా ఎనామెల్ కూడా సురక్షితంగా ఉంటుంది.
దీని ప్రత్యేకమైన వంపుతిరిగిన (ఏంగ్యులర్)
పొడవాటి హేండిల్ నోటిలోని
మూలమూలలకూ సులభంగా చేరుతుంది.
ఈ రోజే సిబాకా ఏంగ్యులర్ డీలక్స్ తెచ్చుకోండి.
ఓ కొత్త అనుభూతి పొందండి. ఇక మళ్లీ
సాధారణమైన టూత్‌బ్రష్ వాడాలన్న ఆలోచన
కూడా రాదు మీకు.


# సిబాకా*
# ఏంగ్యులర్ డీలక్స్

కొసలు ఎక్కువ, బ్రష్ చేయగల శక్తి
ఎక్కువ.

## హిందూస్థాన్ సీబా-గాయగీ వారి నాణ్యత గల ఉత్పాదన



ULKA-HCG-AD-87-TEL




హీరోయిన్ల మధ్య కాలేజీలో రెండు మూడు హాట్ హాట్ సీన్లూ (మరేం లేదు. తీవ్ర సంభాషణలు), హీరోయిన్ని గూండాలెత్తుకుపోయి ఓ గదిలో బంధించడం, విలనుడు ప్రవేశించి హీరోయిన్ని రేప్ చెయ్యటానికి ప్రయత్నిస్తూ, చీరా జాకెట్టూ చింపేసి నానా భీభత్సం సృష్టిస్తుంటే (అదేమిటో రేప్ సీన్లలో మాత్రం బుద్ధిగా చీరా జాకెట్టే ధరిస్తుంది హీరోయిన్ చింపటానికీ, లాగి పారేయటానికీ వీలుగా) హీరో (మోటార్ సైకిల్తో సహా) యింట్లోని అద్దాల తలుపులన్నీ నాశనం చేస్తూ సరాసరి ఆ గదిలోకి ప్రవేశించి విలన్ని కొన ప్రాణం మిగిలే వరకు తన్ని అమ్మాయిని హీరోచితంగా మోటారు సైకిల్ మీద ఎక్కించి తీసుకుపోయాడు.

హీరో ఆ ప్రకారంగా మోటార్ సైకిల్ని అరణ్యం లోకి తీసుకుపోయి అమ్మాయిని దించి, కళ్ళలోకి సూటిగా చూసేడు. ఈ అమ్మాయి అమాంతం హీరోమీద పడిపోయి, కౌగలించుకొని ఉక్కిరి బిక్కిరి చేసేసింది. అతన్ని అపార్థం చేసుకొని, నానా మాటలూ అన్నందుకు క్షమాపణలు వేడుకొని, ఇక నుంచీ హీరో ఏం చెప్తే అది చేస్తానని మాటిచ్చేసింది.

ఇక ఇద్దరూ పాటా, డాన్స్ మొదలెట్టేరు. ఆ పాటలో నాకు అక్కడక్కడా అర్థం అయిన ముక్కలు "చంపేస్తా, నమిలేస్తా, కొరికేస్తా, తినేస్తా" ఇలా వున్నాయి. చాలా మటుకి ఏదో అడవి భాషలా వుంది యింకా నయమే. బాగా అర్థం అయిపోయేయంటే అసలు భరించలేం. సీతవైపు చూసేను. వెక్కిన కంద గడ్డలా తయారయింది మొహం. "ఇదేం సినిమా? అసలది డాన్సా, కుస్తీ పట్లా?" పళ్ళు కొరు కుతూ, నా వైపు తినేసేలా చూస్తూ అడిగింది. తన చెయ్యిని నా చేతిలోకి తీసుకున్నాను ఎపాలజెటిక్‌గా.

హీరో హీరోయిన్స్ పాటని విశాఖపట్నం బీచ్‌లో మొదలు పెట్టి, మైసూర్ బృందావన్ గార్డెన్స్‌లో రెండవ చరణం, ఊటీలో మూడవ చరణం అయి నాలు గవ చరణం ఖజురహో శిల్పాల మధ్య చిత్తుగా వానలో తడిసి, శిల్పాల్ని మించిన భంగిమలుయిస్తూ, రిపీట్ చెయ్యటానికి వీల్లేని భాషని ద్వంద్వార్థాలుగానూ, డైరెక్ట్ గానూ పాట రూపంలో పలికిస్తున్నారు. నాకు యిటు వైపు కూర్చున్న ఇరవై ఏళ్ళ అబ్బాయి కుర్చీలోంచి లేచిపోయి, ముందుకి వంగిపోయి, ముఖం నిండా టెన్షన్ లాంటి భారంతో అతి శ్రద్ధగా చూసేస్తున్నాడు. ఇటు వైపు సీత నూటైదు డిగ్రీల వేడితో సినిమానీ, సాహి త్యాన్నీ, స్త్రీల స్థాయిని యింతగా దిగజార్చే బూర్జువా వ్యవస్థనీ తిట్టిపోస్తోంది. నా మనస్సు వీటన్నిటికీ ఎప్పుడో అతీతం అయిపోయింది ఇటువంటి సినిమాలు చూసి చూసీ. నిర్వికారంగా చూస్తున్నాను.

సరే పాట అయింది. ఇక ఈ పదిహేనేళ్ళ హీరో యిన్, పద్దెనిమిదేళ్ళ హీరో, కాలేజ్ క్లాస్ రూమ్‌లో పాఠాలు వినటం మానేసి, ఒకరికొకరు చిన్న చిన్న చీటీల మీద ప్రేమ పాఠాలు రాసుకొని, అందించుకుంటూ తెగ ప్రేమించేసుకుంటున్నారు. క్లాస్‌లో యెవరూ పాఠాలు వినడం లేదు. పాఠం చెప్పటానికి వచ్చిన లెక్చరర్ సర్కస్‌లో బఫూన్‌లా వున్నాడు. రకరకాలుగా అల్లరి పట్టిస్తున్నారు పిల్లలు. టీచర్, పిల్లలూ కల్సి అసభ్యంగా జోకులేసుకుంటున్నారు.

"ఛీ, టీచర్స్‌ని యింత హీనంగా చూపిస్తుంటే...ఆ వృత్తినే అవమాన పరుస్తుంటే బాధగా లేదూ?" సీత వేదన.

సరే. ఈ పిల్లదీ, పిల్లవాడూ మరో రెండు డ్యూయెట్లు పాడేసి (సీత టెంపరేచర్, పక్కసీటు అబ్బాయి బి.పి. రెండూ పెరిగిపోయేయి. రెండు రకాల ఆవేశాలతో) రెండో డ్యూయెట్‌లో పిల్లదాని తండ్రి కంటపడిపోయి, అతడు ఈ పిల్లని యింట్లో బంధిం చేసి, ప్రేమపక్షుల్ని విడదియ్యటం. అక్కడినుంచీ హీరో కాలేజ్ ఎగ్గొట్టి, విరహ గీతాలు పాడుతూ అమ్మాయి యింటిముందు కుక్కలా తిరగటం. లోపల నుంచీ ఆమె గారి విరహ వేదన.

"ఈ పిల్లకేం పోయింది? బోలెడు డబ్బిచ్చి మొగు డిని కొనగల తండ్రి వున్నాడు. యెటొచ్చీ చెడిపోయేది వీడే. పాపం చదువూ, ఉద్యోగం లేక అఘోరించాలి" సీత కామెంట్.

"నీ తలకాయ. సినిమాలో అలా యేంజరగదు. వీళ్ళిద్దరికీ పెళ్ళయి హాయిగా వుంటారు."

"అది కాదు నేనంటున్నది. నిజ జీవితంతో పోలుస్తు న్నాను."

చుట్టూ వున్న పది సీట్ల జనం అదిరిపడేలా పకపకా నవ్వేను సీత అజ్ఞానానికి. "పోలికా? జీవితంతోనా? ఇది జీవితానికి చాలా దూరం. వదిలెయ్యి" నవ్వాపుకొని చెప్పేను.

ఇంతలో హీరోయిన్ యెలాగో తప్పించుకొని ప్రియుడి వళ్ళో వాలిపోయింది. ఆ పిల్ల అన్నయ్య... వీడో చిన్న గూండా— అదేమిటో హీరో తప్ప అంతా 'గూండాలే— మళ్ళీ విడదీసి లాక్కుపోయి, మొట్ట మొదట హీరోయిన్ని రేప్ చెయ్యబోయి హీరో చేతిలో తన్నులు తిన్న విలన్ ఇంట్లో బంధించేడు, ఆ విలన్‌నే సూపర్ విజన్‌కి పెట్టి. ఈ విలన్ అమ్మాయికి మేనబావట. అమ్మాయి తండ్రి ప్రవేశించి, సినీ పరిభాషలో నాలుగు తిట్టి మేనబావకిచ్చి పెళ్ళి చెయ్యబోతున్నట్లు ఆల్టి మేటమ్ యిచ్చి, వెళ్ళిపోయాడు.

"ఎంత దుర్మార్గుడైన తండ్రయినా, యిలాంటి జులపాల గూండా వెధవకి కూతుర్నిచ్చి పెళ్ళిచెయ్యడు. మళ్ళీ ఒక్కతే ముద్దుల కూతురట" సీత సణుగుడు.

"అబ్బా ఇది సినిమా. జీవితంలోకి వెళ్ళకు" మంద లించేను.

ఇంతలో విరహగీతాలు మరి పాడలేక హీరో క్లబ్బుకి వెళ్ళి తాగుడు మొదలెట్టేడు. చంటిమీద రెండు చిన్న పీలికల్లాంటి బట్టలు కట్టుకొని గంతులేస్తూ వచ్చేసింది ఓ ఆడ మహాకాయం. ఇలాంటి డాన్స్ సీన్స్‌లో కళ్ళు మూసుకొని నిద్ర పోతాన్నేను. సీత మాత్రం హెచ్చెక్కి పోయి నన్ను నానా తిట్లూ తిడుతోంది యిలాంటి సినిమాకి తీసుకొచ్చినందుకు.

కళ్ళు మూసుకొని వారం రోజుల్లో రాబోయే పుట్టిన రోజుకి చిన్న. వాడికి బట్టలు కొనాలంటే బడ్జెట్‌లో యింకే ఖర్చుకి కోత పెట్టాలా అన్న విషయం మీద కేంద్రీకరిస్తున్నాను మెదడుని. నా చెయ్యిమీద వెచ్చగా చెయ్యి పడింది. ఉలిక్కిపడి చూసేను. పక్కసీట్లోని అబ్బాయి సినిమా చూస్తూ ఎక్సయిట్‌మెంట్‌లో చెయ్యి వేసినట్లున్నాడు. నా చెయ్యితీసుకొని మళ్ళీ కళ్ళు మూసుకొన్నాను. ఆలోచన. 'తాకట్టు పెట్టిన వెండి కంచం విడిపించకపోతే యిక వాళ్ళు జమచేసేసు కుంటారు. సుధాకర్ కేమో ఆ ధ్యాసే లేదు. రేపెలా గైనా డబ్బు తెచ్చి విడిపించమని గుర్తు చెయ్యాలి..'మళ్ళీ చేతి స్పర్శ నా చేతిమీద. కాలి మీద కూడా ఏదో పాకుతున్నట్లు...కళ్ళు తెరిచేను. ఓరగా చూస్తూ కాలు నొక్కుతున్నాడు పక్కసీటు అబ్బాయి.

"చూడు బాబు. ఎంత తన్మయత్వం అయినా నా కాలుమీద అలా కాలేసి తొక్కటం బాగులేదు. కొంచెం చూసుకోమ్మా" —చెమ్మదిగా అయినా తీవ్రంగా

వెప్పేను.

"సారీ"—ఒక్కసారిగా సిగ్గుపడ్డట్లు ముఖం ఎర్రగా చేసుకుని ఒదిగి కూర్చున్నాడు కుర్చీలో.

"ఏమయింది?" సీత అడిగింది.

"ఇలాంటి సీన్లు చూడడం వలన వచ్చిన పరిణామం, అంతే. మరేం లేదు."

సినిమా అవుతోంది కానీ మనస్సు దానిమీద లేదు. మనిషిలోని బలహీనతల్ని రెచ్చగొట్టి, నరాల్ని వేడెక్కించి, యువతని పెడదారి పట్టించే యిలాంటి సీన్లున్న సినిమాలని ఎందుకు బేన్ చెయ్యరు? ఆ కేబరే డాన్స్ జరుగుతున్నంతసేపూ ఈలలూ గోలలూ. ఆడదాని శరీరంతో పచ్చి వ్యాపారం చేస్తున్నారు స్త్రీని పూజిస్తామని గొప్పలు చెప్పుకొనే దేశంలో పుట్టి.

అరె...హీరో హీరోయిన్ని ఈసారి గుర్రంమీద ఎక్కించుకొని పారిపోతున్నాడే...వెనక గుర్రాలమీద విలన్ మనుషులు. హీరో గుర్రంమీంచి హీరోయిన్‌తో సహా దూకి పరుగెడుతున్న రైల్లో ఎక్కేడు. వీళ్ళూ అనుసరించేరు. రైల్లోంచి నదిలోకి దూకేరు. విలన్లు ఇక అలసిపోయి యింటికి పోయేరు.

తర్వాత సీన్లో ఈదుకొని ఒడ్డుకు వచ్చి, ప్రేమ గొప్పతనం గురించి హెవీ డైలాగ్స్ చెప్పుకొని, అరణ్యంలోకి సాగిపోయేరు. అక్కడో యిల్లు కట్టుకున్నారు. పెళ్ళీ అన్నీ అయేయి అడవి సాక్షిగా. ఇంతలో ఈ పదిహేనేళ్ళ పిల్లకి గర్భం కూడాను. అబ్బాయి మురిసిపోతూ తొమ్మిది నెలలూ నిండేక, పురుడు కూడా సాయం చేసేసేడు.

"వీళ్ళిద్దరికీ తిండెలా వస్తోంది?" సీత అనుమానం.

"డోన్ట్ థింక్ అన్ రొమాంటికలీ. ప్రొడ్యూసర్ రెండి పెడ్తున్నాడు." జోకేస్తున్నాననుకున్నాను కానీ సీత సీరియస్‌గా చూసింది నా వైపు.

హీరో, హీరోయిన్, పిల్లాడు. మురిపాలు, ముచ్చట్లూ. అన్నట్లు కథకి సంబంధంలేని హాస్య జంట మొరటు హాస్యం. రెండర్థాల మాటలు యింకా ఏడిపించేస్తు న్నాయి.

ఆలోచనల్లోకి జారిపోయేను మళ్ళీ. సుధాకర్ ఏం చేస్తున్నాడో! పాపం నైట్ డ్యూటీలు, ఓవర్ టైములతో ఆరోగ్యం పాడవుతోంది. రేపట్నుంచీ పాల వాడికి మరికొంచెం ఎక్కువ చేసి, రాత్రిళ్ళు ఓ గ్లాసు పాలు సుధాకర్ కోసం స్పేర్ చెయ్యాలి.

హఠాత్తుగా వికటాట్టహాసం విన్పించడంతో తుళ్ళి పడ్డాను. బావ విలనుడు ఎప్పుడు వచ్చేడో...పిల్లవాడిని యెత్తుకుని పారిపోతున్నాడు. హీరోయిన్ ఏడుస్తూ వెనకాలే పరుగెడుతోంది. విలన్ పిల్లాడిని దాచెయ్యటం, హీరో హీరోయిన్స్‌ని బంధించటం, భారీ యెత్తున ఫైట్లూ, తర్వాత పశ్చాత్తాపాలూ...అన్ని కష్టాలూ తీరి, హీరోయిన్ కొడుకుతో సహా హీరో కౌగిట్లోకి చేరేవేళకి, మా మొహాలు వందేసి కొరడా దెబ్బలు తిన్నవాళ్ళ మొహాల్లా అయిపోయాయి.

సీతకి ఇక మాట్లాడ్డానికి కూడా ఓపిక లేక మౌనంగా అనుసరించింది నన్ను. ఇంటికి చేరేం. అప్పటికి పిల్లలూ ఇల్లుచేరి, భోజనాలయి, గాఢ నిద్రలోకి జారుకున్నారు

## కేసెట్ రివ్యూలు

పుస్తకాల సమీక్ష కు 'గ్రంథావని' వున్నట్లే, తెలుగులో వెలువడే రకరకాల ఆడియో, వీడియో కాసెట్లకు 'క్యాసెట్ రివ్యూలు' అనే కొత్త శీర్షికను ప్రారంభించాలని నిశ్చయించాము. ఈ రివ్యూలు చదివి పాఠకులు తమకు అభిరుచికి సంబంధించిన క్యాసెట్లను ఆదరిస్తారని ఆశిస్తున్నాము.

ఈ శీర్షిక ప్రస్తుతానికి నెలకు ఒకసారి ప్రకటిస్తాము.

ఈ శీర్షికకు వివిధ క్యాసెట్ల కంపెనీల వారు తెలుగులో తాము తయారుచేసిన ఆడియో, విడియో క్యాసెట్లు రెండు కాపీలుగా మాకు అందజేయాలి.

**క్యాసెట్ సమీక్షలు త్వరలో ప్రారంభం!**

—ఎడిటర్

చదువుకునే బాధ యివ్వాళ్టికి తప్పిందని సంతోషించి.

* * *

"రాత్రంతా ఒకటే పీడకల అనుకోండి సుధాకర్! ఆ అరుపులూ, ఫైట్లూ, ప్రేమలూ యేం సినిమా! తెలుగు సినిమా యింత దరిద్రపు స్థాయికి దిగజారిందని నిన్నటి దాకా తెలీని మూర్ఖురాల్ని"—సీత బోర్ కొట్టేస్తోంది సుధాకర్‌ని కూర్చోబెట్టి నేను నిద్ర లేచే సరికి. అప్పటికే వాళ్ళిద్దరూ కాఫీలు సేవిస్తున్నారు.

"ఇది విన్నావా రమా! ఎదురింటి ఉమాకాంతరావు గారి అమ్మాయి రోజా నిన్నటి నుంచీ కన్పించటం లేదుట. స్కూల్ నుంచీ యింటికి రాకపోయేసరికి అంతా వెదికేరట. పోలీస్ రిపోర్ట్ యిచ్చేరట" చెప్పేడు సుధాకర్ నేనింకా బెడ్ దిగకుండానే.

"మాకేం తెలీలేదే" ఆశ్చర్యపోయేను.

"మీరు సినిమాకి వెళ్ళిపోయేరుగా"

"అట్నుంచి వచ్చేక సినిమా ధాటికి వడదెబ్బ తిన్న వాళ్ళలాగా అయిపోయి నిద్రలకు పడిపోయేం కదే!" సీ వెప్పింది.

"విను ఏమయిందో! ఈ అమ్మాయి వాళ్ళ క్లాస్‌మేట్ ఓ అబ్బాయితో కలిసి రైల్వే స్టేషన్‌లో కన్పించి దిట. అర్ధరాత్రి పట్టుకుని అమ్మాయిని యింటిలో అప్పగించేరు పోలీసులు. పొద్దున్నే నేను వస్తుంటే మూడో యింటి చిరంజీవి రహస్యంగా చెప్తున్నాడు నాతో."

"రోజా..." నాకు నోట మాటరాలేదు.

"మై గుడ్‌నెస్. పట్టుమని పదహారేళ్ళుకూడా లేనట్లుంది ఆ పిల్లకి. పారిపోయి యెలా బ్రతుకుదామని ఏం చేద్దామని?" సీత నోరు తెరుచుకుపోయిం ఆశ్చర్యంతో.

"నిన్న సినిమాలో అమ్మాయి, అబ్బాయి బత లేదూ! అలా బ్రతుకుదామని" అన్నాన్నేను.

"డౌన్ విత్ టీనేజ్ లవ్ స్టోరీ మూవీస్! డావ్ సెన్సార్ బోర్డ్" సీతకి ఆవేశం వచ్చేస్తోంది.

"సర్లెండి. మీరూ నేనూ ఏం చెయ్యగలం యిల ఆవేశ పడటం తప్ప. ఖచ్చితంగా ఇది సినిమా ప్రభావమే. ఈ సినిమా ప్రేమల బారినుంచీ టీనేజ్ పిల్లల్ని ఎవరు రక్షిస్తారో యేమో!" సుధాకర్ నిస్పృహ

"నేనే ఈ దేశానికి నియంతనైతే ఇరవై ఏళ్ళు నిండ వాళ్ళకీ, చదువుకుంటున్న వాళ్ళకి యిలాంటి సినిమాల చూపించటాన్ని నిషేధిస్తాను" సీత చెప్పింది.

"నీ మొహం. నువ్వే నియంతవైతే మొత్తానికిలాం సినిమాలనే నిషేధించవచ్చు. పెద్దవాళ్ళయి, పెళ్ళయి మనం మాత్రం ఆ సినిమాని యేం ఆనందించేం డబ్బిచ్చి వేయించుకున్న శిక్షలా వుంది తప్పితే."

"ఔనౌను. ఘోర నేరాలు చేసినవారికి శిక్షగ వెయ్యటాన్కి ఇలాంటి సినిమాల ప్రింట్స్‌ని జైళ్ళల వుంచవచ్చు" సీత ఐడియా.

"అప్పుడు ఖైదీలు జైళ్ళు బద్దలుచేసి పారిపోవటాన్కి ఇంకా ఛాన్సుంది" సుధాకర్ చెప్పేడు నవ్వుల మధ్య.

